క్లుప్తంగా

వక్ఫ్ సవరణ చట్టం వెనక్కి తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న ముస్లిం సోదరులు

బోథ్: వక్ఫ్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో ముస్లిం సోదరులు శుక్రవారం మసీదులో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ చట్టం ద్వారా వక్ఫ్ ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. సుప్రీం కోర్టు సైతం పలు సందేహాలను లేవనెత్తిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మౌలానా అఖీల్ అహ్మద్, మాజీదుద్దీన్, అబ్దుల్ అలీ, ఫయిమ్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

గాలి బీభత్సం



ఎగిరిపోయిన రేకులు

ఇచ్చోడ: మండలంలో బాధిగూడలో శుక్రవారం సాయంత్రం వీచిన గాలికి సిడాం గంగారాం ఇంటిపై కప్పు, రేకులు ఎగిరిపోయాయి. ఒక్కసారి ఆకస్మత్తుగా గాలి వీయడంతో రేకులు కొట్టుకుపోయినట్లు బాధితుడు గంగారాం తెలిపారు. ఇంట్లోని వస్తువులు కూడా ధ్వంసం అయ్యాయని వాపోయాడు.

కేసీఆర్‌ను కలిసిన చారులత రాథోడ్



కేసీఆర్‌తో చారులత రాథోడ్

ఉట్నూర్‌రూరల్: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉట్నూర్ మాజీ జెడ్పీటీసీ చారులత రాథోడ్ ఆయన నివాసంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈనెల 27న వరంగల్ జిల్లాలో ఎల్కతుర్తిలో జరగనున్న పార్టీ రజతోత్సవ సభ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ మొగిలి

ఉట్నూర్‌రూరల్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఉట్నూర్ సీఐ మొగిలి సూచించారు. మండలంలోని తాండ్ర, ముసల్‌పాడ్ గ్రామాల్లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు పోలీసులు మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైబర్ మోసాలు, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పట్టణంలోని విద్యానగర్, మోచిగల్లి, భుక్తాపూర్, సినిమా రోడ్ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో శనివారం జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరుగుతుందని మార్క్‌ఫెడ్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గుడిహత్నూర్ పీఏసీఎస్ ద్వారా కొనుగోలు జరపనున్నట్లు పేర్కొన్నారు. మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, పాయల్ శంకర్ తదితరులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. క్వింటాలు మద్దతు ధర రూ.3371తో కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.

నేరడిగొండలో..

నేరడిగొండ: నేరడిగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం ఉదయం 9 గంటలకు జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ అధ్యక్షుడు సాబ్లే కిషోర్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం డైరెక్టర్, ప్రజాప్రతినిధులు, రైతులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

ఉట్నూర్‌రూరల్: మండలంలోని గంగన్నపేటలో సెయింట్‌పాల్స్ చర్చి ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రై డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఫాదర్ గుడ్‌ఫ్రై డే గురించి వివరించారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని హోలీ ట్రినిటీ చర్చ్‌లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఫాదర్ జోజప్ప పోలిశెట్టి ఆధ్వర్యంలో చర్చిలో ప్రార్థనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సిలువ మార్గంలో నడుస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలో చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీచర్స్‌కాలనీలో విశ్వవాణి చర్చిలో పాస్టర్ మాణిక్యం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యేసు క్రీస్తు త్యాగాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో షాలోమ్ చర్చి పాస్టర్ నెహమ్యా, బెత్తెస్తా చర్చి రెవరెండ్ జక్కయ్య, గ్లోరియస్ చర్చి పాస్టర్ రమేశ్, కరుణకర్ పాల్గొన్నారు.



ఉట్నూర్‌రూరల్: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

నేరడిగొండ: మానవాళి మోక్షానికి జీసస్ మార్గాన్ని అందించారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా మండల కేంద్రంలోని చర్చ్‌లో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చర్చ్ ఫాదర్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను శాలువతో సన్మానించారు. చర్చ్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నానక్ సింగ్, రాథోడ్ సురేందర్, ప్రతాప్ పాల్గొన్నారు.



ఇంద్రవెల్లి: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ఇచ్చోడ: గుడ్ ఫ్రైడే వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు



నేరడిగొండ: ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

టీకాలు సద్వినియోగం చేసుకోవాలి



ఇచ్చోడ: టీకా వేస్తున్న పశువైద్యాధికారి



నేరడిగొండ: మాట్లాడుతున్న పశువైద్యాధికారి

ఇచ్చోడ: పశువైద్య శాఖ ఆధ్వర్యంలో మండలంలో చేపడుతున్న గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని ముఖరా(కే)లో గాలి కుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశుపోషకులు పాల్గొన్నారు.

నేరడిగొండ: పాడి రైతులు తమ పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. శుక్రవారం మండలంలోని బుద్దికొండ, రాజుర గ్రామాల్లో టీకాలు వేశారు. గాలికుంటు వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్త చర్యగా ప్రభుత్వం నివారణ టీకాలు వేయిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని పశు పోషకులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మున్సిపల్ కార్మికులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ఆదిలాబాద్: మున్సిపల్ కార్మికులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్రా దేవేందర్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను కోరారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మున్సిపల్ కార్మికులకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అదే విధంగా మున్సిపల్ కార్మికులకు కనీస వేతనంగా రూ. 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు చనిపోతే రూ. 30 వేలు ఇవ్వాలని విన్నవించారు. అంతే కాకుండా వెంటనే మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ నాయకులు, మున్సిపల్ టెక్నీషియన్లు, మంతెన కాంతారావు, మెరుగు చిరంజీవి, నారాయణ రెడ్డి, దర్శనాల నగేష్, అగ్గిమల్ల స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

తాంసి: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పొన్నారి మార్కండేయ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన, కప్పర్ల బ్రహ్మంగారి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు రఘు, రమణ, రజనీకాంత్ రెడ్డి, అశోక్, కొడాల మహేందర్, కేదారేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ

తలమడుగు: మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన రైతు కుమ్మరి లింగన్న ఇటీవల ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోగా.. లింగన్న కుటుంబాన్ని శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శించారు. ఇటీవల రుణమాఫీ కాలేదని దీంతో ఆత్మహత్య చేసుకున్న లింగన్న కుటుంబాన్ని అసెంబ్లీలో ప్రస్తావించడం జరిగిందన్నారు. ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వెంట నాయకులు మొట్టె కిరణ్ కుమార్, అభిరామ్ రెడ్డి, తిరుమల గౌడ్, ప్రకాష్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

అమరవీరుల సంస్మరణ సభ విజయవంతం చేయండి

నార్నూర్: ఇంద్రవెల్లి మండల కేంద్రంలో ఈనెల 20న నిర్వహించే అమరవీరుల సంస్మరణ సభ విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు పూసం ఈశ్రు అన్నారు. శుక్రవారం మండలంలోని భవానీగూడ గ్రామంలో చలో ఇంద్రవెల్లి కార్యక్రమంపై గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనుల హక్కుల సాధన కోసం ఎందరో మహనీయులు అమరులయ్యారని అన్నారు. ఆయన వెంట నాయకులు మధుకర్, జాలీంషావ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన కేమ విఠల్‌కు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును శుక్రవారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అందజేశారు. జిల్లా కేంద్రంలోని ఎంపీ నివాసంలో లబ్ధిదారుడికి రూ.57వేల చెక్కు స్థానిక నాయకులతో కలిసి అందించారు. మాజీ జెడ్పీటీసీ పులి నారాయణ, సదానంద్, మయూర్‌చంద్ర, చంద్రకాంత్ పాల్గొన్నారు.

సమాజాన్ని అధ్యయనం చేయాలి



మాట్లాడుతున్న వెంకట్

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయులు సమాజాన్ని అధ్యయనం చేస్తూ.. విద్యారంగ అభివృద్ధికి పాటుపడాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో డీఎస్సీ 2024 ఉపాధ్యాయులకు అవగాహన తరగతులు నిర్వహించారు. విద్యార్థుల సామాజిక, కుటుంబ పరిస్థితులపై అంచన పెంపొందించుకోవాలన్నారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిష్టన్న, అశోక్, సంఘ బాధ్యులు సురేఖ, స్వామి, ఇస్తారి, శివన్న పాల్గొన్నారు.

పశువులకు అందని వైద్యం

- పశువైద్యాధికారి లేక ఇబ్బందులు
- అసిస్టెంట్‌తోనే వైద్యం
- మృత్యువాత పడుతున్న పశువులు

సిరికొండ: మనిషికి రోగం వస్తే వైద్యుడి వద్దకు వెళ్లి చికిత్స చేయించుకుంటాం. కానీ మూగజీవాలకు వ్యాధులు సోకితే చెట్ల మందులు ఉపయోగిస్తారు. మహా అయితే గ్రామంలో ఉన్న పశువైద్యుడి వద్దకు వెళ్తారు. మండలంలో ఉన్న పశువైద్యశాలలో వైద్యుడు లేకపోతే ఆ మూగజీవాల పరిస్థితి అంతే. అచ్చం అలాగే సాగుతుంది మండంలోని పశువుల దుస్థితి. మండలంలోని పశువైద్యశాలలో వైద్యుడు లేక ఉన్న అసిస్టెంట్‌తో పశువులకు పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైద్యం నుంచి రికార్డు వరకు..

నూతనంగా ఏర్పడిన సిరికొండ మండలంలో 19 గ్రామ పంచాయతీల్లో 52 గ్రామాల్లో ఆవులు, గేదెలు, ఎద్దులు కలిపి సుమారుగా 8 వేల వరకు, మేకలు, గొర్రెలు 7 వేల వరకు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వాటికి ఏదైనా వ్యాధి సోకితే మండల కేంద్రంలోని పశువైద్యశాలకు తీసుకువస్తారు. ఇక్కడ నియమించిన పశువైద్యాధికారి ఆసుపత్రికి వచ్చి కొన్ని నెలలు అవుతుంది. దీంతో ఆసుపత్రిలో ఉన్న అసిస్టెంట్‌తోనే వైద్యం చేయాల్సి వస్తుంది. అసిస్టెంటే వైద్యం చేయాలి, పశువుల గణన, మందులు వంటి రికార్డులు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పర్మినెంట్ పశువైద్యాధికారిని నియమించాలని పశుపోషకులు కోరుతున్నారు.



సిరికొండలోని పశువైద్యశాల

గొర్రెలు మృతి చెందాయి



నాకు 80 వరకు గొర్రెలు ఉన్నాయి. మండలంలో పశువుల డాక్టర్ లేక గొర్రెలకు రోగం వస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు. గత రెండు నెలల్లో రోగం వచ్చి 37 గొర్రె పిల్లలు మరణించాయి. ఏ కారణంతో మరణించాయో తెలియదు. మండలానికి పశువుల డాక్టర్‌ను నియమించాలి.

– గోర్ల మల్లేష్, పశుపోషకుడు, సిరికొండ

డాక్టర్‌ను నియమించాలి



మండలంలో శాశ్వత పశువుల డాక్టర్ లేక పశువులకు రోగం వస్తే సూదులు, మందులు కోసం ప్రైవేట్ వైద్యులను సంప్రదించాల్సి వస్తుంది. దీంతో మాకు ఆర్థికంగా భారం పడుతుంది. సరైన వైద్యం అందక మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి.

– కాల్వ దత్తు, పశుపోషకుడు, సిరికొండ

లేబర్ అడ్డా @ఆర్అండ్‌బీ

- జిల్లాకు ప్రత్యేక ఫెసిలిటేషన్ సెంటర్ మంజూరు
- రూ.25 లక్షల వ్యయంతో నిర్మాణం
- ప్రారంభమైన పనులు

కైలాస్‌నగర్: భవన నిర్మాణరంగ కార్మికులు అనగానే ఆదిలాబాద్ పట్టణ ప్రజలకు టక్కున గుర్తుకు వచ్చేది జిల్లా కేంద్రంలోని నేతాజీచౌక్. ఇంటి పునాదులు తీయడం నుంచి రంగులు వేసేందుకు అవసరమైన కార్మికులంతా ఇక్కడే లభిస్తారు. పట్టణంతో పాటు చుట్టూ పక్కల గ్రామాల నుంచి ఉదయం 8 గంటలకే పనుల కోసం తరలివచ్చే కార్మికులతో మధ్యాహ్నం 12గంటల వరకు నేతాజీచౌక్ సందడిగా కనిపిస్తోంది. ప్రజలు తమకు అవసరమైన కార్మికులను ఇక్కడి నుంచే మాట్లాడుకుని తీసుకెళ్తారు. గత దశాబ్ద కాలంగా కార్మికుల అడ్డాగా సాగుతున్నప్పటికీ కార్మికులకు ప్రభుత్వాలు ఇప్పటి వరకు ఎలాంటి వసతులు కల్పించ లేదు. ఎట్టకేలకు కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించిన ప్రభుత్వం వారి కోసం ప్రత్యేక ఫెసిలిటేషన్ సెంటర్‌ను జిల్లాకు మంజూరు చేసింది. పనులు సైతం ప్రారంభం కావడంతో కార్మికుల అడ్డా నేతాజీచౌక్ నుంచి ఆర్అండ్‌బీ వద్దకు మారనుంది.

అందించే సంక్షేమ పథకాలివే..

భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయి. కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా నమోదై ఉన్న కార్మికులకు అనేక ప్రయోజనాలను కల్పిస్తోంది. పని పరిస్థితులను మెరుగుపర్చడంతో పాటు సామాజిక భద్రత, జీవన ప్రమాణాలను మెరుగుపర్చేలా చర్యలు చేపడుతుంది. గర్భవతి అయిన మహిళ కార్మికులకు రెండు డెలివరీల వరకు రూ.30 వేల ఆర్థిక సాయం అందిస్తారు. అలాగే కార్మికుల పిల్లల విద్య కోసం, కుమార్తెల పెళ్లిల కోసం ఆర్థికసాయం అందజేస్తారు. కార్మికుడు మరణించిన, వైకల్యానికి గురైన ఆర్థికసాయం అందజేయడంతో పాటు కార్మికులపై ఆధార పడ్డ కుటుంబీకులకు విద్య, వైద్యం, వినోదం వంటి సౌకర్యాలను కల్పిస్తోంది. ఈ ప్రయోజనాలను పొందాలంటే కార్మికులు తప్పనిసరిగా కార్మికశాఖ ద్వారా జారీ చేసే లేబర్‌కార్డులను కలిగి ఉండాల్సి ఉంటుంది.



ప్రారంభమైన నిర్మాణ పనులు

ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో పనులు

భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం జిల్లాకు ప్రత్యేక ఫెసిలిటేషన్ సెంటర్‌ను మంజూరు చేసింది. రూ.25 లక్షల వ్యయంతో చేపట్టిన భవనాన్ని ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు. భవన నిర్మాణం పూర్తయితే కార్మికులు ఎక్కడో చౌక్‌ల్లో పనుల కోసం ఇబ్బందులు పడుతూ ఉండాల్సిన అవసరం లేకుండా పోతుంది. అలాగే వారికి అందాల్సిన సంక్షేమ పథకాలన్నింటిని ఇక్కడి నుంచే పొందే అవకాశముటుంది.

– రాజలింగు, కార్మికశాఖ అధికారి

అవస్థలను తొలగించేలా..

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని నేతాజీచౌక్‌లో కార్మికుల అడ్డా గత కొన్నేళ్లుగా కొనసాగుతోంది. అయితే అక్కడ ఎలాంటి వసతులు లేకపోవడంతో కార్మికులకు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ.. చలికి వణుకుతున్నారు. ఇలాంటి పరిస్థితిని తొలగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి నిధులు రూ.25 లక్షల వ్యయంతో జిల్లాకు ప్రత్యేక కార్మిక ఫెసిలిటేషన్ సెంటర్ మంజూరు చేసింది. స్థానిక ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం ఆవరణలో దీని నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ పనులు ప్రారంభించారు. నిధులు సిద్ధంగా ఉండడంతో యుద్ధ ప్రతిపాదికన పనులు సాగుతున్నాయి. కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల లబ్ధి కోసం కార్యాలయాలు, మీసేవ కేంద్రాల చుట్టూ తిరుగాల్సిన అవసరం ఉండదు. తమ సంక్షేమం కోసం చేపట్టిన భవన నిర్మాణంపై కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కరువు



పని చేస్తున్న ఉపాధిహామీ కూలీలు

- కనిపించని టెంట్లు, తాగునీరు
- ఇబ్బంది పడుతున్న కూలీలు

వివరాలు..

	నార్నూర్‌లో	గాదిగూడలో
గ్రామ పంచాయతీలు	23	25
జామ్‌కార్డులు	9,920	9,200
యాక్టీవ్ జామ్‌కార్డులు	7,492	6,900
మొత్తం కూలీల సంఖ్య	21,300	14,000
యాక్టీవ్ కూలీల సంఖ్య	14,848	10,140

నార్నూర్: ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో పను లు చేసేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అలాగే జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. కనీస సౌకర్యాలు లేక కూలీలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో వీరికి పని ప్రదేశంలో నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేసేవారు. తాగునీటితో పాటు మజ్జిగ, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం అవి ఎక్కడ కనిపించడం లేదు. కొన్ని గ్రామాల్లో మాత్రమే అంతంత మాత్రమే సౌకర్యాలు కల్పిస్తున్నారు. మిగతా చోట్ల తాగునీరు కూడా అందించడం లేదు. అలాగే కూలీలు చేసిన పనులకు సకాలంలో డబ్బులు రాక అవస్థలు పడుతున్నారు. గడిచిన ఐదు వారాలుగా ఉపాధి కూలీలకు వేతనాలు అందడం లేదు. కొలతల ప్రకారం పనులు చేయకపోతే కూలి గిట్టుబాటు కాదని ఎండల్లో పనులు చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

అందని పరికరాలు.. నార్నూర్ మండలంలో మొత్తం 23, గాదిగూడ మండలంలో మొత్తం 25 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గ్రామాల్లో ప్రతీ ఏడాది ఉపాధి పనులు జోరుగా సాగుతాయి. 2017 వరకు పని ప్రదేశంలో తాగునీరు, కూలీలకు నీడ కోసం టెంట్లు, ప్రాథమిక చికిత్స కోసం మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్, మజ్జిగ, ప్యాకెట్లతో పాటు పరికరాలు అందజేశారు. ఉపాధి కూలీలకు దాదాపు ఏడేళ్ల నుంచి తాగునీరు, పార, గడ్డపార, తట్టలు, ఇతర సామగ్రి అందడం లేదు. గతంలో తాగునీటికి రూ. 5, గడ్డపారకు రూ. 10, తట్టకి రూ. 13 చెల్లించేది. వేసవి సీజన్లో 70 శాతం పనులు చేస్తే మిగిలిన 30 శాతం వేసవి భత్యం కలిపి కూలీలకు చెల్లించేవారు. అయితే గత మూడేళ్లుగా ఉపాధి వేసవి భత్యాన్ని రద్దు చేశారు. మరోవైపు ఉపాధి హామీ పథకంలో రోజంతా కష్టపడి పని చేస్తున్న కూలి గిట్టుబాటు కావడం లేదని కూలీలు వాపోతున్నారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

వసతులు కల్పిస్తాం..



ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో పని ప్రదేశాల్లో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వసతులు కల్పిస్తాం. ఉపాధి హామీ పనికి వెళ్లేటప్పుడు కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అన్ని రకాల చర్యలు తీసుకోవడంతో పాటు పనిచేసిన కూలి డబ్బులు సకాలంలో చెల్లించేలా చూస్తాం.

– రాథోడ్ సురేందర్, ఈజీఎస్ ఏపీవో నార్నూర్

బూత్ కమిటీల ఎన్నిక

ఖానాపూర్: మండలంలోని సేవ్యానాయక్ తండాలో బీజేపీ 212వ బూత్ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఉపేందర్ తెలిపారు. బూత్ అధ్యక్షుడిగా పాండునాయక్, ప్రధాన కార్యదర్శిగా బుక్య నితిన్‌ను ఎన్నుకున్నారు.